


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com
www.suryaa.com

4 PM
www.suryaa.com

శనివారం
13 ఏప్రిల్ 2024
పేజీలు: 02


# బీజేపీ మా ఎమ్మెల్యేలకు 50 కోట్లు ఆఫర్ చేసింది

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో బీజేపీ ఆపరేషన్‌కు కమలం పేరుతో తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనేందుకు ప్రయత్నిస్తోందని సీఎం సిద్ధరామయ్య ఆరోపణలు చేశారు. సిద్ధరామయ్య ఓ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల ఆఫర్ ఇచ్చి కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 'గత ఏడాది నుంచి బీజేపీ మా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడుగొట్టాలని చూస్తోంది. అందులో భాగంగానే ఆపరేషన్ కమలం చేపట్టింది. మా ఎమ్మెల్యేలకు రూ. 50 కోట్ల ఆఫర్ ఇచ్చింది. కానీ, బీజేపీ వారి ప్రయత్నం వృథా అయింది' అని సీఎం సిద్ధరామయ్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థానాలు గెలువకపోతే పరిస్థితి ఏంటనే ప్రశ్నకు స్పందిస్తూ.. 'మా ప్రభుత్వానికి ఏం కాదు. మా ఎమ్మెల్యేలు ఎవ్వరూ కూడా పార్టీ మారరు. కనీసం ఒక్క ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీని వీడరు. నా నాయకత్వంలోనే ఐదేళ్ల పాటు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కొనసాగుతుంది' అని సిద్ధ రామయ్య స్పష్టం చేశారు. మరోవైపు.. సీఎం సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను బీజేపీ ఎంపీ ఎస్ ప్రకాశ్ తీవ్రంగా ఖండించారు. 'సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు చాలా దురదృష్టకరం. ఆయన పలుమార్లు ఇటువంటి ఆరోపణలు చేస్తునే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఒక వర్గం మద్దతు కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రభుత్వం చేసిన పనులు, కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయలు చెప్పటం వదిలేసి.. బీజేపీపై నకిలీ ఆరోపణల చేస్తున్నారు. లోక్ సభ ఎన్నికలకు బదలు.. ఎన్నికల తర్వాత సీఎం కుర్చి కోసమే ఆలోచిస్తున్నారు' అని మండిపడ్డారు.



## కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం

పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జెస్సోర్ రోడ్డులోని స్లమ్ ఏరియాలో శనివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో చాలా ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో జెస్సోర్ ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



## బస్సులోంచి కిడ్నాప్ చేసి.. 11 మందిని చంపిన ఉగ్రవాదులు

పొరుగుదేశం పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. రెండు వేర్వేరు ఘటనల్లో సుమారు 11 మందిని హతమార్చారు. ముందుగా బాలూచిస్థాన్ ప్రావిన్స్‌లో క్వెట్టా నుంచి తఫ్తాన్‌కు వెళ్తున్న ఓ బస్సును నోష్కి జిల్లాలో హైవేపై అడ్డుకున్నారు. అందులోని తొమ్మిది మంది ప్రయాణికుల్ని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. వారిని ఓ కొండ ప్రాంతానికి తీసుకెళ్లి దారుణంగా హతమార్చారు. ప్రయాణికుల్ని కిడ్నాప్ చేయడంతో ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చేపట్టగా ఓ వంతెన సమీపంలో ఆ తొమ్మిది మంది మృతదేహాలను కనుగొన్నారు. మరోఘటనలో అదే హైవేపై వెళ్తున్న కారుపై దాడి చేసిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రెండు ఘటనలకూ ఇప్పటి వరకూ ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత వహించలేదు.



## అన్నీ సర్దుకున్నాయి.. భారీ మెజార్టీతో గెలవబోతున్నాం

అన్నీ సర్దుకున్నాయి.. తిరుపతిలో భారీ మెజారిటీతో జనసేన పార్టీ అభ్యర్థి గెలవగెలవబోతుందన్నారు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి తిరుపతి వచ్చిన ఆయన.. అసంతృప్త నేతలతో జరిపిన చర్చల్లో పాల్గొన్నారు.. శుక్రవారం అర్ధరాత్రి వరకు చర్చలు జరిగాయి.. అంతా కలిసి కట్టుగా పనిచేసేందుకు నిర్ణయం తీసుకున్నారు..



అయితే, ఈ రోజు నాగబాబు మాట్లాడుతూ.. కూటమి నేతలు అందరూ ఏకతాటిపైకి వచ్చారు.. చిన్న చిన్న మనస్పర్థలు ఉంటాయి.. అందుకే పవన్ కల్యాణ్ తిరుపతి వచ్చారని తెలిపారు.. కూటమి నేతలతో మాట్లాడాం. అన్నీ సర్ధుకున్నాయి.. తిరుపతి లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలవబోతున్నారు అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు. కాగా, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వంపై జనసేన ఇంఛార్జ్ కిరణ్ రాయల్, జనసేన నేతలు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే.. అభ్యర్థిని మార్చాలంటూ ఆందోళనకు దిగారు.. బహిరంగంగా పార్టీపై సంచనల వ్యాఖ్యలు చేశారు.. టీడీపీ, జనసేన అధిష్టానం నుంచి వారిని సముదాయించే ప్రయత్నాలు జరిగాయి.. దీంతో, కొంత సైలెంట్ అయినా.. వారిలో అసంతృప్తి మాత్రం అలాగే ఉండిపోయింది.. అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటనతో అంతా ఒక్కతాటిపైకి వచ్చేశారు. శుక్రవారం రోజు తిరుపతి వెళ్లిన జనసేన అధినేత పవన్ కల్యాణ్.. అర్ధరాత్రి వరుకు తిరుపతిలో కూటమీ పార్టీల నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహించారు.. తిరుపతి నియోజకవర్గం నుంచి వైసీపీని పంపించేయాలని పిలుపునిచ్చిన ఆయన.. జనసేన, టీడీపీ సమన్వయంతో వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని సూచించారు. ఏ ఒక్క నాయకుడు.. కార్యకర్త త్యాగాన్నీ, కష్టాన్నీ మరచిపోం.. వచ్చేది కూటమి ప్రభుత్వమే.. నాయకులు, కార్యకర్తల బాధ్యతను సమష్టిగా తీసుకుంటాం అనే పార్టీ నేతలకు భరోసా కల్పించారు పవన్ కల్యాణ్. ఇక, ఆరణి శ్రీనివాసులు గెలుపుకోసం అంతా కృషి చేస్తామని ప్రకటించిన సంగతి విదితమే.

## హాట్ అందాలతో పూజా హెగ్డే

హాట్ హాట్ ఫోజుతో టైట్ ఫిట్ డ్రెస్‌లో కాక పుట్టిస్తుంది పూజా హెగ్డే . కవ్వించే అందాలతో కుర్రకారు మనసుదోచేస్తుంది. వరుస సినిమా ఆఫర్స్‌తో ఈ బ్యూటీ ఫుల్ జోరులో ఉంది. 'కిసి కా భాయ్ కిసి కి జాన్' బాలీవుడ్ చిత్రంతో పాటు తెలుగులో మహేష్ బాబు సరసన నటిస్తుంది. తాజాగా ఈ భామ సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.

## కడియం శ్రీహరిపై మందకృష్ణ మాదిగ మరోసారి ఫైర్..



స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మరోసారి మండిపడ్డారు. మాటిమాటికి విలువల గురించి మాట్లాడే కడియం శ్రీహరిని సూటిగా ప్రశ్నిస్తున్నాను. శ్రీహరికి విలువలు ఉంటే, విలువలతో కూడిన రాజకీయాలు చేయదలచుకుంటే స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలిచావో ఆ పదవికి ముందు రాజీనామా చేయాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. ఆ తర్వాతనే విలువల గురించి మాట్లాడాలని కడియం శ్రీహరికి మందకృష్ణ సూచించారు.



## కొడుకు వీర్యంతో బిడ్డను కన్న తల్లి

అనా ఓబ్రెగాన్ (69) అనే మహిళ స్పెయిన్ దేశానికి చెందిన ఒకప్పటి సినీ నటి. ఆమె కొడుకు అలెస్ (27) క్యాన్సర్ బారినపడి మరణించాడు. అయితే మరణానికి ముందు అలెస్ ఏదోఒక రోజు తాను తండ్రిని కావాలని కలలు కనేవాడు. వయసు పెరిగితే వీర్యం కౌంట్ తగ్గుతుందని భయంతో ముందే తన వీర్యాన్ని ఓ స్పెర్మ్ సెంటర్‌లో భద్రపర్చాడు. దీంతో తండ్రి కావాలన్న తన కొడుకు కోరికను 2023లో కొడుకు వీర్యంతో సరోగసీ ద్వారా ఆడ పిల్లకు జన్మనిచ్చింది. తాజాగా ఆ సంగతిని బయటపెట్టి అందరికీ షాకిచ్చింది.



## జైలు నుంచి విడిపించేందుకు రూ.34 కోట్లు

మరణ శిక్ష ఎదుర్కొంటున్న ఓ వ్యక్తిని కాపాడేందుకు కేరళీయులు రూ.34 కోట్లు సేకరించారు. కోజికోడ్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ సౌదీ అరేబియాలో ఓ బాలుడికి కేర్ టేకర్‌గా ఉండేవారు. కానీ 2006లో ఆ బాలుడు పొరపాటున చనిపోవడానికి అబ్దుల్ కారణమయ్యాడు. దీంతో అతడికి కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ క్రమంలో బ్లడ్ మనీ కింద రూ.34 కోట్లు చెల్లిస్తే మరణ శిక్ష తప్పించేందుకు బాధిత కుటుంబం అంగీకరించడంతో వారు ఈ నిధులు సేకరించారు.



## గోవాలో అయిదేళ్ల చిన్నారి రేప్, మర్డర్

గోవాలో అయిదేళ్ల చిన్నారిని రేప్ చేసి హత్య చేశారు. వాస్కో వద్ద నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో ఆ చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో పోలీసులు 20 మందిని విచారిస్తున్నారు. వాడెం ప్రాంతంలో ఉన్న నిర్మాణ ప్రదేశంలో ఆ చిన్నారి  ఉదయం అపమారక స్థితిలో కనిపించింది. అయితే డాక్టర్ల వద్దకు తీసుకు వెళ్లిన సమయంలో ఆమె మృతిచెందినట్లు గుర్తించారు. ఎస్పీ సునితా సావంత్ ఈ అంశంపై మీడియాకు వెల్లడించారు. అత్యాచారం చేసి, గొంతు పిసికి చంపినట్లు పోస్టు మార్టమ్ రిపోర్టులో తేలింది. ఐపీసీ, పోక్సో చట్టాల ప్రకారం రేప్, మర్డర్ కేసు నమోదు చేశారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న 20 మంది కార్మికులను పోలీసులు విచారిస్తున్నారు.



## సిడ్నీ మాల్‌లో కత్తిపోట్లు, కాల్పులు.. నలుగురు మృతి

ఆస్ట్రేలియాలోని సిడ్నీ మాల్‌లో కత్తిపోట్ల దాడి జరిగింది. ఆ అటాక్‌లో నలుగురు మృతిచెందినట్లు సమాచారం ఉన్నది. సిడ్నీలోని బోండీ జంక్షన్ వెస్ట్‌ఫీల్డ్‌లో ఈ ఘటన జరిగింది. కత్తిపోట్లతో పాటు కాల్పుల ఘటన కూడా జరిగినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. కత్తిపోట్లు, కాల్పులతో దద్దరిల్లిన ఆ మాల్ నుంచి వందల సంఖ్యలో జనం పరుగులు తీసినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వెస్ట్‌ఫీల్డ్ మాల్‌లో కాల్పులు శబ్ధం వినిపించినట్లు స్థానిక మీడియా చెప్పింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి భయానకంగానే ఉన్నది. మాల్‌కు వచ్చిన కస్టమర్లను తరలించారు. భారీ సంఖ్యలో అంబులెన్సులు, పోలీసుల వాహనాలు ఉన్నాయి.

# నేహా శెట్టి వయ్యారాలు చూడతరామా..

నేహా శెట్టి తెలుగు సినీ ఇండస్ట్రీలో వినిపిస్తోన్న పేరు. కానీ కథానాయికగా ఇప్పటికీ పెద్ద రేంజ్‌కు మాత్రం ఎదగలేదనే చెప్పాలి. ఇక డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా ఓవర్ నైట్ పాపులర్ అయింది. ఆ మధ్య 'బెదురులంక' సినిమాతో పలకరించినా.. ఈమె కెరీర్ పెద్దగా ఉపయోగపడింది లేదనే చెప్పాలి. తాజాగా టిల్లు స్క్వేర్ మూవీలో రాధికగా కాసేపు అలా మెరిసింది. చేతిలో సినిమాలున్నా.. ఎప్పటికప్పుడు హాట్ ఫోటో షూట్స్‌తో అలరిస్తోంది.శాండిల్ వుడ్ భామ అయిన నేహా శెట్టి.. తెలుగులో పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఆకాశ్ పూరీ హీరోగా నటించిన 'మెహబూబా' మూవీతో తెరంగేట్రం చేసింది. నేహా శెట్టి తన సొంత భాష కన్నడలో విడుదలైన 'ముంగారు మేల్ 2' మూవీతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా ఓ మోస్తరు విజయం సాధించింది.ఆ తర్వాత 'గల్లీ రౌడీ' సినిమాతో పలకరించింది నేహా. అటు అఖిల్ హీరోగా నటించిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' మూవీలో ఓ చిన్న పాత్రలో నటించింది.ఇక సిద్దు జొన్నలగడ్డ టైటిల్ రోల్లో నటించిన 'డీజే టిల్లు' మూవీతో నేహా శెట్టి పేరు పాపులర్ అయింది. ఆ తర్వాత 'బెదురులంక 2012', రూల్స్ రంజన్ మూవీల్లో మెరిసింది. తాజాగా మరోసారి 'టిల్లు స్క్వేర్' మూవీతో ప్రేక్షకులను కాసేపు అలా పలకరించి వెళ్లింది.





# పల్లవి పటేల్‌తో ఒవైసీ కూటమి.. తొలి జాబితా విడుదల

దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 2024 లోక్‌సభ ఎన్నికల కోసం మూడు ప్రధాన కూటములు ఏర్పడ్డాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీల ఇండియా కూటమితోపాటు ఇప్పుడు పీడీఎం (పిచ్ఛా, దళిత, ముసల్మాన్) కూటమి కూడా బరిలో నిలిచింది. అప్నా దళ్ కమరావాడి నాయకురాలు పల్లవి పటేల్, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కలిసి పీడీఎం కూటమిని ఏర్పాటు చేశారు. ఈ కూటమి ఉత్తరప్రదేశ్‌లో తొలి జాబితా విడుదల చేసింది. ఈ రెండు పార్టీలు కలిసి ఏడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. పీడీఎం తొలి జాబితాలో బరేలీ నుంచి సుభాష్ పటేల్, హత్రాస్ నుంచి జైవీర్ సింగ్ ధంగర్, ఫిరోజాబాద్ నుంచి న్యాయవాది ప్రేమ్ దత్ బఘేల్, రాయ్ బరేలీ నుంచి హఫీజ్ మహ్మద్ మొబీన్, ఫతేపూర్ నుంచి రామకృష్ణ పాల్, భదోహి నుంచి ప్రేమ్ చంద్ బింద్, చందౌలీ నుంచి జవహర్ బింద్ ప్రకటించారు. ఈ సమాచారాన్ని పీడీఎం కార్యాలయ కార్యదర్శి మహ్మద్ ఆషిక్ తెలిపారు. ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి ఇండియా కూటమి తరపున పోటీ చేస్తారనే ఊహాగానాల మధ్య పీడీఎం ఇక్కడ ముస్లిం అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది. ఇది కాంగ్రెస్ అభ్యర్థికి సమస్యగా మారుతుందని భావిస్తున్నారు. అభ్యర్థుల ప్రకటనకు ఒక రోజు ముందుగా శుక్రవారం నాడు లక్నోలో పీడీఎం మొదటి సమావేశం జరిగింది. ఇందులో పీడీఎంకు నేతృత్వం వహిస్తున్న పల్లవి పటేల్‌తో పాటు ఏఐఎంఐఎం నేతలు కూడా పాల్గొన్నారు. నాలుగైదు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఉత్తర ప్రదేశ్‌లోని 80 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల పేర్లను చర్చించారు. ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ చేస్తామని, మిగతా స్థానాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని పీడీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు అజయ్ పటేల్ తెలిపారు.



# వైసీపీకి మరో షాక్.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే

ఎన్నికల వేళ అధికార వైఎస్ఆర్ పార్టీకి మరో షాక్ తగిలింది. తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆ పార్టీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కొండేటి రాజీనామా చేశారు. ఈ ఎన్నికల్లో పి.గన్నవరం టిక్కెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని విప్పర్తి వేణుగోపాల్‌కు సీఎం జగన్ కేటాయించారు. దీంతో అప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యే చిట్టిబాబు.. శనివారం పార్టీకి గుడ్‌బై చెప్పారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్ఆర్ కడప జిల్లా ముద్దనూరులో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆయన పి.గన్నవరం నుంచి పోటీచేసే అవకాశం ఉంది. 2019 సాధారణ ఎన్నికల్లో పి.గన్నవరం నుంచి వైఎస్ఆర్‌సీపీ నుంచి పోటీచేసిన కొండేటి చిట్టిబాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. చివర వరకూ ఆయన టిక్కెట్ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పార్టీని వీడి.. కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.



# తండ్రైన మంచు మనోజ్

నటి మంచు లక్ష్మి శుభవార్త చెప్పారు. తన సోదరుడు, నటుడు మంచు మనోజ్ తండ్రయ్యారని వెల్లడించారు. ఆయన సతీమణి మౌనికా రెడ్డి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారని తెలిపారు. "భగవంతుడి ఆశీస్సులతో మా ఇంట చిన్నారి దేవత అడుగుపెట్టింది. మనోజ్, మౌనిక ఆనందంగా తమ పాపను ఈ భూమ్మీదకు ఆహ్వానించారు. ఆ పాపను మేము ప్రేమగా 'ఎంఎం పులి' అని పిలుస్తున్నాం. ఆ శివుడి ఆశీస్సులు ఈ కుటుంబంపై ఉండాలని, వీరందరూ ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా" అని 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. దీనిని మంచు మనోజ్ రీపోస్ట్ చేశారు. పలువురు నెటిజన్లు స్పందిస్తూ అభినందనలు చెబుతున్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో గతేడాది మనోజ్ - మౌనిక వివాహం జరిగిన విషయం తెలిసిందే. కొన్నాళ్లుగా నటనకు దూరంగా ఉన్న ఈ హీరో ప్రస్తుతం 'వాట్ ది ఫిష్' కోసం సిద్ధమవుతున్నారు. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. నిహారిక కీలక పాత్ర పోషిస్తున్నారు.



# త్వరలో 5 డోర్ల గూర్ఖా

ఫోర్స్ మోటార్స్ ప్రతిష్టాత్మకంగా తయారుచేస్తున్న 'గూర్ఖా' 5 డోర్ల వెర్షన్ మోడల్‌ను తర్వలో లాంచ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ మోడల్‌కారు తయారీకు కంపెనీ గత రెండేళ్లుగా పనిచేస్తోందని చెప్పింది. ఈ నెలాఖరులోగా దీన్ని లాంచ్ చేయనున్నట్లు సమాచారం. ఈమేరకు ఫోర్స్ కంపెనీ సరికొత్త 5 డోర్ వెర్షన్‌తో పాటు, ఇప్పటికే ఉన్న 3 డోర్ వెర్షన్ 'గూర్ఖా'లో కూడా కొన్ని మార్పులు చేయబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. 5 డోర్ గూర్ఖా మారుతి జిమ్నీ, మహీంద్రా థార్ వంటి వాటితో పోటీపడుతుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఫోర్స్ గూర్ఖా కొత్త 5 డోర్‌మోడల్‌లో 17 అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ అందులోబాటులో ఉంటున్నట్లు కంపెనీ తెలిపింది. ముందు, వెనుక వచ్చే బంపర్‌ల్లో కూడా మార్పులు చేసినట్లు చెప్పింది. నాలుగు సిలిండర్ల టర్బో డీజిల్ ఇంజిన్‌తో ఇది రాబోతుంది. 90 బీహెచ్‌పీ, 250 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 5 స్పీడ్ గేర్‌బాక్స్ ఉండబోతుందని కంపెనీ చెప్పింది.



# జైల్లో కేజ్రీవాల్‌ను వేధిస్తున్నారు
## ఆప్ ఎంపీ సంజయ్ సింగ్

తీహార్ జైల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌ను వేధిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం సూచనల ఆధారంగా కేజ్రీవాల్‌కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. శనివారం ఉదయం ఢిల్లీలో సంజయ్ సింగ్ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మాట్లాడారు. జైలు మాన్యువల్ ప్రకారం.. ములాఖత్‌కు వచ్చిన వారిని జైల్లో ఉన్న వ్యక్తి ముఖాముఖి కలుసుకునేందుకు తీహార్ జైలు పరిపాలనా యంత్రాంగం అనుమతి ఇచ్చిందని, కానీ కేజ్రీవాల్ విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని సంజయ్ సింగ్ ఆరోపించారు. అర్వింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ తన భర్తను ముఖాముఖి కలవాలని దరఖాస్తు పెట్టుకుంటే జైలు అధికారులు అనుమతించలేదని, కిటికీ గుండా మాట్లాడుకోవాలని సూచించారని ఆయన తెలిపారు. కరుడుగట్టిన నేరగాళ్లకు కూడా వాళ్లను కలిసేందుకు వచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడేందుకు అనుమతిస్తారని, కేజ్రీవాల్ విషయంలో ఎందుకు అనుమతించరని సంజయ్‌సింగ్ ప్రశ్నించారు. కేజ్రీవాల్‌ను మానసికంగా కుంగదీయాలనేది కేంద్ర ప్రభుత్వం కుట్ర అని ఆయన ఆరోపించారు. అర్వింద్ కేజ్రీవాల్ నుంచి హక్కులను లాగేసుకోవద్దని తాను ప్రధాని మోదీని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాని అభ్యర్థిస్తున్నానని సంజయ్ సింగ్ అన్నారు.



# సెల్ఫీ అడిగితే చెంప చెల్లుమనిపించిన బాలకృష్ణ

సీనియర్ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి అభిమానులపై చేయిచేసుకున్నారు. సత్యసాయి జిల్లా కదిరిలో బాలయ్య ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో కదిరికి చేరుకున్నారు. ఆయన ల్యాండ్ కాగానే అభిమానులు కొందరు బాలయ్య దగ్గరికి వచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని సెల్ఫీ కోసం యత్నించగా.. సహనం కోల్పోయిన నటసిహం అతనిపై చేసుచేసుకున్నారు. అంతటితో ఆగకుండా అభిమానులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



# అనుమానాస్పద స్థితిలో ప్రముఖ పాప్ సింగర్ హఠాన్మరణం..!

సంగీత ప్రపంచంలో పెను విషాదం చోటుచేసుకుంది. దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ పాప్ సింగర్ 'పార్క్ బో రామ్' అనుమానాస్పద స్థితిలో గురువారం అర్ధరాత్రి మరణించింది. కేవలం 30 సంవత్సరాలు ఉన్న ఈ పాప్ సింగర్ దక్షిణ కొరియా పాప్ సింగర్ గా ప్రపంచంలో ఎంతో ఫేమస్. ఇకపోతే ఆమె మరణానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియలేదు. చనిపోయే సమయానికి కొన్ని గంటల ముందు తన స్నేహితులతో ఓ ప్రైవేట్ పార్టీలో పాల్గొన్న ఈమె వారి స్నేహితులతో కలిసి మద్యం తాగింది. రాత్రి పది గంటల సమయంలో ఆవిడ రెస్ట్ రూమ్ కు వెళ్ళగా ఎంతసేపైనా రాకపోవడంతో ఆమె స్నేహితులు వెళ్లి చూశారు. అయితే అక్కడ అపస్మారక స్థితిలో కనపడటంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దాంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ప్రముఖ పాప సింగర్ ఇక లేరని వార్త తెలియడంతో ఆమె అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.ఆమెకి 17 ఏళ్ల వయసులోనే 2010 సంవత్సరంలో సూపర్ స్టార్ కే 2 పాటల పోటీలో పాల్గొని తన టాలెంట్ ను నిరూపించుకుంది. దాంతో వెనక్కి తిరిగి చూడకుండా 2014 తన 'సింగిల్ బ్యూటిఫుల్' ఆల్బమ్ రిలీజ్ కావడంతో ఆ ప్రపంచంలో అడుగు పెట్టింది. ఇక అదే సంవత్సరం 'గావ్ చాట్' అనే మ్యూజిక్ అవార్డ్స్ లో 'ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్' గా కూడా అవార్డు గెలుచుకుంది. ఈ సంఘటనతో అభిమానులు ఆమెకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేస్తున్నారు.